క్లుప్తంగా

బీటీ రోడ్లకు రూ.15 కోట్లు మంజూరు

జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాల బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవాబ్‌పేట మండలం కొల్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి దేపల్లి వరకు 5 కి.మీ. నిర్మాణానికి రూ.4.15 కోట్లు, బాలానగర్ మండలం మోతిఘనపూర్–రాయికల్ రోడ్డుకు రూ.2.40 కోట్లు, గంగాధరపల్లి నుంచి రామేశ్వరం దేవాలయం రోడ్డుకు రూ.1.55 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. జడ్చర్ల మండలం కిష్టారం–అంబటాపూర్ రోడ్డుకు రూ.1.55 కోట్లు, రాజాపూర్ మండలం మైసమ్మకుంట తండా–కేశ్వానాయక్ తండా రోడ్డుకు రూ.90 లక్షలు, ఊర్కొండ మండలం రాచాలపల్లి–మాదారం రోడ్డుకు రూ.2 కోట్లు, మిడ్జిల్ మండలం సింగందొడ్డి నుంచి లాక్యతండా, నయకుని తండా రోడ్డుకు రూ.2.45 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

వ్యవసాయ కూలీలకు రూ.850 వేతనం ఇవ్వాలి

నవాబుపేట: వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.850 వేతనం ఇచ్చేలా సమగ్ర చట్టం తీసుకురావాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంకే శ్రీనివాస్, విజయలక్ష్మి, కోస్గి శంకర్, భువనేశ్వరి, తదితరులు ఉన్నారు.

దళితులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి రాజకీయంగా క్రియాశీల పాత్ర పోషించిన దళిత నాయకులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని షెడ్యూల్డ్ కుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు డిమాండ్ చేశారు. గురువారం అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత నాయకులు కంచిమి లక్ష్మణ్, వినోద్‌కుమార్, సాయిబాబ, ప్రవీణ్‌కుమార్, మాచన్‌పల్లి రాజు లకు నామినేటెడ్ పదవులు ఇవ్వడానికి దేవరకద్ర ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి కృషి చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహయ్య, రాష్ట్ర కోశాధికారి అంకిళ్ల రఘునాథ్, బాలరాజు, సామెల్, లక్ష్మణ్, యాదయ్య, చెన్నకేశవులు, వెంకటస్వామి పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడుదాం

ఊట్కూరు: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడుదామని నారాయణపేట జిల్లా బాలకార్మిక శాఖ అ ధికారి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం పగిడిమారిలో బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని బాలలను ఎవరు పనిలో పెట్టుకొవద్దని ఆయన కోరారు. 14 సంవత్సరాలలోపు బాలబాలికలు బడిలో ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, రేణుక, గ్రామస్తులు విష్ణుమూర్తిగౌడ్, మొగులప్పగౌడ్ పాల్గొన్నారు.

వాల్మీకి ఆదర్శప్రాయుడు

సాక్షి, నెట్‌వర్క్: వాల్మీకి గొప్ప వ్యక్తి అని జిల్లా అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి ఇందిర, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి నరసింహ, కోశాధికారి సంతోష్ కుమార్, సభ్యులు యాదయ్య,రమేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా వాల్మీకి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పద్మ, అనురాధ, వాసంతి, నరసింహారావు, వెంకట్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్‌లోని 16వ వార్డు పరిధిలోని బోయపల్లిలో వాల్మీకి ఆలయంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, లక్ష్మణ్‌నాయక్, పాషా, చిన్న, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదికవి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. అంజయ్య, మహేష్, సత్యం, నాగరాజు, అంజయ్య, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

■ రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి అందరికీ ఆదర్శప్రాయుడని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలం రాచాలలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మూసాపేట మండలం చక్రాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వాల్మీకి జయంతిలో పాల్గొని దాసర్‌పల్లి వాల్మీకి యువకులు చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు.

■ జడ్చర్ల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో బీసీ జాగృతి సేన అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ నేతృత్వంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన నాయకులు విజయ్‌కుమార్, బీంరాజ్, రాధాకృష్ణ, గోపాల్, రఘు, శివశంకర్ పాల్గొన్నారు.

■ దేవరకద్ర పట్టణంలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి అర్చకులతో పూజలు చేయించారు. వాల్మీకి సంఘం మండల అధ్యక్షులు హరికృష్ణ, ఉపాధ్యక్షులు సంతోష్, కార్యదర్శి వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

■ చిన్నచింతకుంట మండల కేంద్రంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో పవిత్ర జలాలను ఆడపడుచుల మంగళహారతులతో గ్రామ పు రవీధులలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో వాల్మీకి విగ్రహానికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, ఇతర అధికారులు



చౌదర్‌పల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న వాల్మీకి నాయకులు



మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో..



చిన్నచింతకుంటలో..



ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో..



బీజేపీ కార్యాలయంలో..

రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: పంట కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలం అప్పంపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో వరి కొనుగోలు ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో రూ.32 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రామలింగారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కో ఆపరేట్ జిల్లా మానటరింగ్ ఆఫీసర్ దివ్య, కౌకుంట్ల మండల వ్యవసాయ అధికారి శివకుమార్, ఏఈఓలు శ్రీజ, దివ్య, సీఈఓ బషీర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



అప్పంపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

మహమ్మదాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ దేవన్న సూచించారు. గురువారం ఆయన మండలంలోని దేశాయిపల్లి అంగన్‌వాడీ కేం ద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులను ప్రాథమిక స్థాయిలో పాఠశాలకు వచ్చే విధంగా పాటు పడాలన్నారు. కేంద్రం నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చుతోందని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని, పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవన్న

సార్వత్రిక విద్య ప్రవేశాల పోస్టర్ విడుదల

జడ్చర్ల టౌన్: సార్వత్రిక విద్య ద్వారా ఈ ఏడాది నిర్వహించే ప్రవేశాలపై అవగాహన కల్పించేలా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను గురువారం బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ శివయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు అక్టోబర్ 30 చివరి తేదీగా తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, కో ఆర్డినేటర్ బాబర్, సీనియర్ ఉపాధ్యాయులు సయ్యద్ ఇబ్రహీం, గోపాల్, సునీల్, వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్ నమోదు



దేవరకద్రలో ప్లాట్లను పరిశీలించి ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్ నమోదు చేస్తున్న అధికారులు

దేవరకద్ర: దేవరకద్ర మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్లాట్లు ఉన్నవారు ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గురువారం దేవరకద్ర గ్రామ పంచాయతీ ఈఓ సీత్యానాయక్ సిబ్బందితో కలిసి దరఖాస్తుదారుల ప్లాట్లను పరిశీలించారు. ప్లాట్ల యజమానులు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను తెచ్చి అధికారులకు చూయించి ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారందరు డాక్యుమెంట్లతో వచ్చి ఆన్‌లైన్ చేయించుకోవాలని ఈఓ సూచించారు.

హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి

కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని ఆందోళనలు చేసినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. గురువారం కేవీపీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు అధ్యక్షతన సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలంటే మెస్ చార్జీలు రూ.2,500లకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 78 ప్రీ మెట్రిక్ హాస్టళ్లు, 95 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, గురుకులాల్లో 662 హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. ఒక్కో హాస్టల్‌కు నెలకు లక్ష రూపాయల అద్దె చెల్లిస్తున్నారని, అవి కూడా సకాలంలో చెల్లించకపోవడంతో యజమానులు హాస్టల్ భవనాలకు తాళాలు వేస్తున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇటీవల కాలంలో దళితులపై దాడులు పెరిగాయని, నిందితులపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేయడంలో జాప్యం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కుర్మయ్య, వెంకట్రాములు, ఆది విష్ణువర్ధన్, లక్ష్మీదేవి, రాములు, హన్మంతు, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అడ్డాకుల: మూసాపేట మండలం సూర్తితండాలో దసరా పండుగ రోజు ఇద్దరు చిన్నారులు సాయి నాయక్, సాకేత్ నాయక్‌లు నీటి గుంతలో పడి చనిపోయిన నేపథ్యంలో గురువారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్, కొండయ్య, శివరాములు, అనిల్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, హనుమంతు, బాలన్న ఉన్నారు.

కొల్లూరు రోడ్డుకు నిధులు విడుదల



నవాబుపేట: మండలంలోనీ దేపల్లి మట్టి రోడ్డుకు మోక్షం లభించింది. కొల్లూర్ నుంచి దేపల్లికి 5 కిలో మీటర్ల రోడ్డుకు రూ.4.15 కోట్లు మంజూరైనట్లు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రకటించడంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చిన్నరాజమూర్‌లో పౌర్ణమి పూజలు

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం అశ్వీయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకారంలో పూజలు నిర్వహించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకారంలో చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి

ఆర్‌పీపై పోలీసు కేసు?

- మెప్మా సీఓ యాదయ్యపై శాఖాపరమైన చర్యలకు రంగం సిద్ధం
- రుణాల దుర్వినియోగంపై తాజాగా ఉన్నతాధికారుల ఆదేశాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయనగర్‌లోని ఏఎల్‌ఎఫ్ పరిధిలో మహిళా సంఘాల పేరుతో భారీగా రుణాలు తీసుకుని నెలవారీ కిస్తులు చెల్లించకుండా దుర్వినియోగానికి పాల్పడిన ఆర్‌పీ శ్రీలతపై అధికారులు పోలీసు కేసు పెట్టనున్నారు. ఈమె రూ.1.49 కోట్లు సొంతానికి వాడుకున్నట్లు విచారణ బృందం తేల్చిన విషయం విదితమే. ఈ విషయమై నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన ఉన్నతాధికారులు వెంటనే బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని గురువారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డితో పాటు మెప్మా ఇన్‌చార్జ్ పీడీ సురేందర్‌రెడ్డిని ఆదేశించారు. దీంతో వారు ఆర్‌పీపై పోలీసు కేసు పెట్టడమే గాక వాడుకున్న మొత్తం డబ్బుల రికవరీకి యత్నిస్తున్నారు. అలాగే సంబంధిత సీఓ యాదయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు. కాగా, ఈ వ్యవహారం బయట పడటంతో మెప్మా అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడుతున్నారు. ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని గుబులు చెందుతున్నారు.

జీల్దార్‌తిప్పలు తీరేనా?



కేఎల్ఐ రిజర్వాయర్ నుంచి చెరువు వరకు కెనాల్ తవ్వేందుకు శంకుస్థాపన

- ఆరేళ్లుగా ముందుకు సాగని పనులు
- మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామాలకు అందని సాగునీరు
- తాజాగా 'పాలమూరు' నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ప్రతిపాదనలు
- పనులు పూర్తయితే 3 వేల ఎకరాల ఆయకట్టు, వన్యప్రాణులకు మేలు

కొల్లాపూర్: నల్లమల అటవీ ప్రాంతంలోని ముక్కిడిగుండం, మొలచింతలపల్లి గ్రామాలకు సమీపంలోనే కేఎల్ఐ ప్రాజెక్టు ఉంది. ఇక్కడే పాలమూరు ప్రాజెక్టు సైతం నిర్మిస్తున్నారు. రెండు అతిపెద్ద ప్రాజెక్టులు పక్కనే ఉన్నా ఆ గ్రామాలకు మాత్రం సాగునీరు అందడం లేదు. ప్రాజెక్టులకు ఎగువ భాగంలో ఈ గ్రామాలు ఉండటమే ఇందుకు కారణం. దీంతో ఆయా గ్రామాల రైతులు పంటలు సాగు చేసేందుకు నేటికీ వర్షాలపైనే ఆధారపడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని పాలకులు ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోకపోవడంతో రైతాంగం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. దీనిపై ఇటీవల నీటిపారుదల శాఖ అధికారులతో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. దీంతో ఈసారైనా సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశలో రైతులు ఉన్నారు.

ఆ చెరువే ఆధారం..

కృష్ణానది సమీపంలోనే ఉన్న మొలచింతపల్లి, ముక్కిడిగుండం గ్రామాల్లో పంటల సాగుకు జీల్దార్ తిప్ప చెరువే ప్రధాన నీటి వనరు. ఈ చెరువును 1970లో అప్పటి ఎమ్మెల్యే కె.రంగదాసు నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మించారు. చెరువు నీటినిల్వ సామర్థ్యం 2 టీఎంసీలు. ఈ చెరువును ముఖ్యమంత్రి హోదాలో జలగం వెంగళరావు ప్రారంభించారు. ఈ చెరువు కింద 1,300 ఎకరాల ఆయకట్టుకు ఉంది. మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామాల్లోని గొలుసుకట్టు చెరువుల కింద మరో 500 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో పంటల సాగు సాఫీగా జరుగుతున్నప్పటికీ.. రబీ సీజన్‌లో మాత్రం సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

సాగునీటి మళ్లింపు కోసం..

కృష్ణానది నీటిని మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామాల్లోని పంట పొలాలకు అందించాలనే ఉద్దేశంతో 2004లో రూ.3 కోట్లతో కృష్ణా బ్యాక్‌వాటర్‌పై మినీ లిఫ్టు నిర్మించేందుకు శిలాఫలకం వేశారు. కానీ, పనులు చేపట్టలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరోసారి మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామ పొలాలకు సాగునీరు మళ్లించాలనే అంశం తెరపైకి వచ్చింది. ఈ మేరకు 2019లో కేఎల్ఐ నుంచి జీల్దార్‌తిప్ప చెరువుకు నీటిని తరలించేందుకు రూ.19 కోట్లు కేటాయించారు. అదే సంవత్సరం మార్చి నెలలో శంకుస్థాపన చేసినా.. భూ సేకరణకు నిధులు సరిపోవనే కారణంతో పనులు ముందుకు సాగలేదు.

సాగునీటిని మళ్లించాలి



కేఎల్ఐ, పాలమూరు ప్రాజెక్టులు మా గ్రామాల సమీపంలోనే ఉన్నా.. కృష్ణానది నీళ్లు అందడం లేదు. మాకు జీల్దార్‌తిప్ప చెరువు నీళ్లే దిక్కు. వర్షాలు బాగా పడితే చెరువు కాల్వల ద్వారా ఒక పంటకు నీళ్లు అందుతాయి. చెరువులో నీళ్లు తగ్గితే రబీ పంట వేసుకునే అవకాశం ఉండదు. కేఎల్ఐ ద్వారా కృష్ణా నీటిని జీల్దార్‌తిప్ప చెరువుకు మళ్లించేందుకు గతంలో శంకుస్థాపన చేసినా పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి.. సాగునీటిని అందించాలి.
– మల్లేష్‌యాదవ్, ముక్కిడిగుండం

ప్రతిపాదనలు పంపిస్తాం..



జీల్దార్‌తిప్ప చెరువుకు కేఎల్ఐ ద్వారా సాగు నీటిని తరలించేందుకు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధుల మంజూరులో జాప్యం జరిగింది. ఇటీవలే మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ అంశంపై చర్చించారు. కేఎల్ఐ ద్వారా కాకుండా పాలమూరు ప్రాజెక్టులోని నార్లాపూర్ రిజర్వాయర్ ద్వారా నీటిని తరలించాలని నిర్ణయానికి వచ్చాం. అయితే కాల్వలు కాకుండా పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించాలని భావిస్తున్నాం. నెల రోజుల్లో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తాం.
– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

వన్యప్రాణులకూ ఉపయోగమే..

జీల్దార్‌తిప్ప చెరువును ఆనుకొని నల్లమల అటవీ ప్రాంతం ఉంటుంది. ఈ చెరువును కేఎల్ఐ నీటితో నింపితే చెరువు కింద ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందడంతోపాటు.. నల్లమల అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు కూడా తాగునీటి సౌకర్యం కల్పించినట్లు అవుతుంది. ఇప్పటికే జీల్దార్‌తిప్ప చెరువుకు ప్రతినిత్యం వందలాది వన్యప్రాణులు తాగునీటి కోసం వస్తుంటాయి.

ఆస్పత్రిలో దొంగతనాల కట్టడికి చర్యలు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ

మహబూబ్‌నగర్ క్రైం: జనరల్ ఆస్పత్రిలో చిన్నపాటి దొంగతనాలు, ద్విచక్ర వాహనాల అపహరణ కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతామని, దీ నికి ఆస్పత్రి అధికారులు సహకరించాలని టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ అ న్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రి సూ పరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్‌తో సీఐ గురువారం ఆస్పత్రిలో చర్చించారు. దొంగతనాల కట్టడికి తీ సుకోవాల్సిన చర్యలపై మాట్లాడుతూ ఇన్ పేషంట్స్, అవుట్ పేషంట్స్‌కు ప్ర త్యేక టిక్కెట్ విధానం పెట్టడం వల్ల దొంగతనాలు కట్టడి చేయవచ్చని సీఐ తెలిపారు. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలతో పాటు మరికొన్ని అదనంగా పెంచుకోవడం, వాటిని నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఆస్పత్రిలో అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్న సమయాల్లో బయటి నుంచి వచ్చే కొందరు వాహనాలను దొంగతనం చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఆస్పత్రిలో అనుమానాస్పద కదలికలు ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టాలని సూచించారు. ప్రధానంగా రాత్రి సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరం అయితే టూటౌన్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.